
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 26 అక్టోబర్ 2024



14న జాతీయ లోక్‌అదాలత్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

డిసెంబర్ 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పుత్తూరు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సి రాఘువేంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం ఆదా అవుతుందన్నారు. లోక్‌అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులను రాజీ చేసుకోవచ్చని సూచించారు.



ఉచిత గ్యాస్... సూపర్



ప్రజాశక్తి -తిరుపతి టౌన్

'సూపర్ సిక్స్' పథకాల్లో ఉచిత గ్యాస్ ఒకటి.. దీపావళి కానుకగా మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక ప్రకటన చేశారు. గ్యాస్ సిలిండర్లను ఎప్పటి నుంచి పొందవచ్చు అనే వివరాలను వెల్లడించారు. ఏ విధంగా ఉచిత గ్యాస్ కనెక్షన్ తీసుకోవచ్చు అనే విషయాన్నీ తెలిపారు. తెల్లరేషన్ కార్డు, ఆధారే ప్రాతిపదికన ఈ పథకాన్ని అమలు చేయనున్నారు.

తిరుపతి జిల్లాలో 4 లక్షల 92వేల 302 మంది అర్హులుగా ఉన్నారు. ఇందులో 41 ఏజెన్సీలు ఉన్నాయి. మహిళలకు ఏడాదిలో ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లను ఇచ్చేలా సిఎం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన క్యాబినెట్ ఆమోదం పొందింది. శాఖల వారీగా చర్చించి ఆయిల్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు. రాష్ట్రంలో ఉన్న సుమారు కోటి 55 లక్షల గ్యాస్ కనెక్షన్లకు ఏ విధంగా అందుబాటులోకి తేగలుగుతాం అనే దానిపై అధ్యయనం చేశామన్నారు. ఆర్థిక భారం లేకుండా వీలున్నంత త్వరగా పథకం అమలు చేస్తామని స్పష్టం చేశారు. శనివారం ఈ పథకానికి సంబంధించిన ఉత్తర్వులను జారీ చేయనున్నట్లు వెల్లడించారు. అక్టోబర్ 31న డెలివరీ రోజుగా పెట్టుకొని మొదటి సిలిండర్ మార్చి 31 వరకూ ఎప్పుడైనా పొందవచ్చన్నారు. ఉచిత గ్యాస్ కనెక్షన్ పొందేందుకు అర్హత కలిగిన ఎల్పీజీ కనెక్షన్ ఉండాలని, తెల్ల రేషన్ కార్డు, అలాగే ఆధార్ కార్డు ఉండాలని తెలిపారు. ఈనెల 29న మంగళవారం ఉదయం 10 గంటల నుంచి బుకింగ్స్ ప్రారంభమవుతాయి. 30న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఇప్పించనున్నారు. బుకింగ్ అవగానే ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం ఒకటి బుక్ అయ్యిందని ఎస్ఎంఎస్ వెళుతుంది. మూడు ఆయిల్ కంపెనీలతో జరిగిన చర్చను బట్టి 24 నుంచి 48 గంటల్లోపు డెలివరీ పూర్తవుతుంది. గ్యాస్ సిలిండర్ అందించిన క్షణం నుంచి 48 గంటల్లోపు వారి ఖాతాల్లోకి అమౌంట్ జమ అవుతుంది. రూ.894.92 కోట్లు ఆయిల్ కంపెనీలకు 29న అందించనున్నారు. కేంద్రం ఎలా డీబీటీ ద్వారా ఇస్తుందో అలాగే రాష్ట్రం డీబీటీ ద్వారా పంపిణీ చేయనుంది. వచ్చే సిలిండర్ నాటికి నేరుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచే ఈ నిధులు అందిస్తామని వెల్లడించారు. ఎవ్వరికైనా పథకం అందకపోతే 1967 టోల్ ఫ్రీ నెంబర్కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చని మంత్రి పేర్కొన్నారు.

ఈ తేదీల్లో ఉచిత గ్యాస్ పొందొచ్చు..

అక్టోబర్ 31 నుంచి మార్చి 31 లోపు గ్యాస్ సిలిండర్ పొందవచ్చు
రెండవ విడత ఏప్రిల్ 1 నుంచి జులై 30 వరకూ
మూడవ విడత ఆగస్టు 1 నుంచి నవంబర్ 31 వరకూ
నాల్గవ విడత డిసెంబర్ 1 నుంచి మార్చి 31.

ఇళ్ల మధ్య మద్యం షాపు వద్దంటూ నిరసన

ప్రజాశక్తి - తిరుపతి సిటి

కాపురాలు ఉండే ఇళ్ల మధ్య మద్యం షాపు వద్దంటూ స్థానిక మహిళలు శుక్రవారం నిరసన తెలిపారు. తిరుపతి రైల్వేస్టేషన్ సమీపంలోని కస్తూరిబా సందులో నూతనంగా మద్యం షాపును ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు పూనుకున్నారు. మద్యం దుకాణాన్ని నూతనంగా ప్రారంబించేందుకు శుక్రవారం చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న మహిళలు పెద్దఎత్తున అక్కడకు చేరుకుని కాపురాలు ఉండే ఇళ్ల మధ్య మద్యం షాపు పెట్టడం సరైంది కాదని నిరసనకు దిగారు. గతంలోనూ ఇక్కడ షాపు ఏర్పాటు చేస్తుంటే అధికారులకు విన్నవించి మార్పు చేసేలా చేశామని గుర్తు చేశారు. మరోసారి ఇక్కడ షాపు ఏర్పాటు చేయాలను కోవడం సరైంది కాదన్నారు. అధికారులు స్పందించి షాపును తరలించే వరకూ తాము నిరసన కొనసాగిస్తామన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకుని సర్దిచెప్పారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళతామని పోలీసులు హామీ ఇవ్వడంతో మహిళలు నిరసనను విరమించారు.



'భవిష్యత్తు కాంగ్రెస్ పార్టీదే'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ భవిష్యత్తు కాంగ్రెస్ పార్టీదే నని పీసీసీ ప్రధాన కార్యదర్శి, తిరుపతి జిల్లా అధ్యక్షులు ఈద సుధాకర్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం తిరుపతి నగర పరిధిలోని యూత్ హాస్టల్లో తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని పార్టీ తిరుపతి పట్టణ అధ్యక్షులు గౌడ పేరు చిట్టిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద సుధాకర్ రెడ్డి, చిట్టిబాబు మాట్లాడుతూ నవంబర్ 7న విజయవాడలో రాష్ట్ర పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నారని తెలిపారు. పార్టీ పటిష్టతకు, భవిష్యత్తు కార్యాచరణకు పాటించవలసిన అంశాలను వైయస్ షర్మిల రెడ్డి దిసానిర్దేశం చేస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఈ సమావేశానికి పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు బాలగురవం బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంభూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, నెల్లూరు జిల్లా అధ్యక్షులు మాంగాటి గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.



తిరుమలలో టీటీడీ ఈవో విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి -తిరుమల

టీటీడీ ఈవో జె.శ్యామలరావు అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి శుక్రవారం తిరుమలలో విస్తత తనిఖీలు నిర్వహించారు. ముందుగా వకుళామాత కేంద్రీయ వంటశాలను పరిశీలించిన ఈవో నూతనంగా నిర్మిస్తున్న పీఏసీ-5ను తనిఖీ చేశారు. అక్కడ పనుల పురోగతి గురించి ఇంజినీరింగ్ అధికారులతో ఆరా తీశారు. అనంతరం కౌస్తుభం, సప్తగిరి, ఎస్ఎంసీ, షాపింగ్ కాంప్లెక్స్ వద్ద హోటళ్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం శిలా తోరణం వద్దకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఔటర్ రింగ్ రోడ్డులో భక్తుల సౌకర్యార్థం టీటీడీ నిర్మిస్తున్న నూతన క్యూలైన్లు, మరుగుదొడ్లు, ఫుడ్ కోర్టులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. టీటీడీ సిఈ సత్య నారాయణ, ఈ ఈ లు వేణు గోపాల్, సుబ్రహ్మణ్యం, డీ ఈ చంద్రశేఖర్, ఎస్టేట్స్ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



టీటీడీ ఎంప్లాయిస్ బ్యాంకు ఎన్నికలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఈనెల 28వ తేది నిర్వహించనున్న టీటీడీ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్(టీటీడీ ఎంప్లాయిస్ బ్యాంకు) ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని టీటీడీ జేఈఓ (విద్య, ఆరోగ్యం) గౌతమి అధికారులను ఆదేశించారు. శుక్రవారం టీటీడీ పరిపాలన భవనంలో సంబంధిత అధికారులతో జేఈవో సమీక్ష సమావేశం నిర్వహించారు. తిరుమలలో పని చేసే ఉద్యోగులు ఎస్వీ హైస్కూల్ లో, తిరుపతి, ఇతర ప్రాంతాల్లో పని చేసే ఉద్యోగులు ఎస్.జి.ఎస్ హైస్కూల్ లో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. దివ్యాంగులకు గ్రౌండ్ ఫ్లోర్ లో ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవచ్చని చెప్పారు. ఓటు వేసేందుకు వచ్చే ప్రతి ఉద్యోగి తమ ఒరిజినల్ ఐడీ కార్డు తప్పనిసరిగా తీసుకు రావాలని అన్నారు. టీటీడీ ఐటీ విభాగం, ఇంజినీరింగ్, సెక్యూరిటీ విభాగాలకు దిశానిర్దేశం చేశారు. జిల్లా కోఆపరేటివ్ అధికారి లక్ష్మి, ఎన్నికల అధికారి ఉమాపతి, ఝాన్సీ పాల్గొన్నారు.



రాజేంద్ర కుటుంబాన్ని ఆదుకుంటాం: బొజ్జల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

దొమ్మరపాలెం ఇసుక ట్రాక్టర్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన రాజేంద్ర కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం ఆయన చియ్యవరానికి వెళ్లి రాజేంద్ర కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో రాజేంద్ర, అతని కుమారుడు చైతన్య దుర్మరణం చెందడం బాధించిందన్నారు. రాజేంద్ర మరణంతో కుటుంబం పెద్దదిక్కును కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజేంద్ర పిల్లల్ని చదివించే పూర్తి బాధ్యత తానే తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి పరిహారం, ఎకరా భూమిని అందజేసేందుకు కషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదాన్ని మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి రాజకీయం చేయాలని చూస్తున్నాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మునిరాజా నాయుడు, రంగినేని చెంచయ్య నాయుడు, సురేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే 'రీ సర్వే'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తొట్టంబేడు తహశీల్దారు మధుసూదనరావు తెలిపారు. శుక్రవారం తొట్టంబేడు మండలంలోని పిల్లమేడు గ్రామంలో రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. భూ సమస్యలపై రైతులు 41 వినతులు సమర్పించారు. తహశీల్దారు మధుసూదనరావు మాట్లా డుతూ భూ సమస్యల పరిష్కారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. గతంలో రీ సర్వే చేసినపుడు కొన్ని సమస్యలు వచ్చినట్లు ప్రస్తుత ప్రభుత్వం గుర్తించిందన్నారు. గ్రామాల్లో రైతుల మధ్య భూ వివాదాలు లేకుండా పరిష్కరంచాలనే లక్ష్యంతో గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. డిప్యూటి ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే రాఘవయ్య, సర్వేయర్ హరినాథ్, వీఆర్వో కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీరు తొలగింపు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి ఆరవ డివిజన్ కట్టకిందపల్లి వద్ద వర్షాలకు రెండు అడుగుల మేర నీళ్లు నిలిచిపోవడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందిపడ్డారు. సమస్యను స్థానికులు ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు దష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈని తక్షణం సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దీనితో అధికారులు వెంటనే జెసిబి పెట్టించి నిలిచిన నీటిని తొలగించారు. ఈ పనులను జనసేన నగర అధ్యక్షులు రాజారెడ్డి దగ్గర ఉండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బాబ్జీ, హేమంత్, వంశీ, బాలాజీ, పురుషోత్తం పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ తరలిస్తే కఠిన చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

జిల్లాలో సిలికా, క్వార్జ్ అక్రమ మైనింగ్ చేసి తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని, మైనింగ్ ప్రక్రియను ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పక్కాగా పర్యవేక్షించాలని మైనింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు మైనింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ సిలికా, క్వార్జ్ మైనింగ్ పై సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిలికా, క్వార్జ్ మైనింగ్ నిర్వహణ పక్కాగా ఉండాలని, ఎలాంటి అక్రమాలకు తావు ఉండరాదని పేర్కొన్నారు. సదరు సిలికా క్వార్జ్ మైనింగ్ మినరల్ డీలర్ లైసెన్స్ ప్రాంతాలలో ఎంట్రెన్స్, ఎగ్జిట్ ప్రాంతాలలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి 24/7 పర్యవేక్షణ ఉండాలని, సిలికా తరలించే వాహనాలకు జిపిఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో 80 సిలికా లీజులు ఉన్నాయని, 15 క్వార్జ్, అసోసియేటివ్ మినరల్స్ లీజులు ఉన్నాయన్నారు. జిల్లాలో 399 మినరల్ డీలర్ లైసెన్స్ ఏరియాలో ఉన్నాయని వారు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా గనుల శాఖ అధికారి బాలాజీ నాయక్, గూడూరు డివిజనల్ గనుల శాఖ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు జి తెలుగులో 'డబుల్ ఇస్మార్ట్'

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని, కావ్య థాపర్ జంటగా నటించిన మాస్‌ఎంటర్టైనర్ 'డబుల్ ఇస్మార్ట్' సినిమాను ఈ వారం వరల్డ్ టెలివిజన్ ప్రిమియర్ గా జి తెలుగులో ఈ ఆదివారం(అక్టోబర్ 27న) సాయంత్రం 6 గంటలకు ప్రసారమవుతుందని జీ తెలుగు నెట్వర్క్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా కథ అంతర్జాతీయ మాఫియా డాన్ బిగ్ బుల్ (సంజయ్ దత్) చుట్టూ తిరుగుతుంది.

'ఒకే దేశం..ఒకే ఎన్నిక' ప్రజాస్వామ్యానికి ప్రమాదం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్

ఒకే దేశం ఒకే ఎన్నిక అనే విధానం భారతదేశ ప్రజాస్వామ్య సమాఖ్య విధానానికి ప్రమాదకరమని ఎస్ఎఫ్ఐ పూర్వ జిల్లా కార్యదర్శి మాధవకృష్ణ అన్నారు. ఎస్వీయూ ఆర్థిక శాస్త్ర విభాగ సమావేశ మందిరంలో 'ఒకే దేశం... ఒకే ఎన్నిక' అంశంపై స్టడీసర్కిల్ జరిగింది. రాష్ట్రాల హక్కులు హరించేలా ఈ నిర్ణయం ఉందన్నారు. ఈ విధానాన్ని దేశంలో అమలు చేయనీకుండా విద్యార్థులు అంశంపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ ఎ.సుదర్శన్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు అక్బర్, అశోక్, యూనివర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు నరేంద్ర, వినోద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన ఆర్‌జెడి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆర్‌జెడి గిరి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. కళాశాలలో వివిధ రికార్డులను పరిశీలించి, కళాశాల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల అభివృద్ధికి పలు సూచనలు చేశారు. క్రీడల్లో ప్రథమ స్థానం పొందిన పుత్తూరు డిగ్రీ కళాశాల విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య, వైస్ ప్రిన్సిపాల్ సూరిబాబు పాల్గొన్నారు.



ఆప్కాస్ కార్మికులకు వేతనం పెంచాలి : సిఐటియు

తిరుపతి సిటి : అగ్రికల్చర్ కళాశాల ఆప్కాస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనం పెంచాలని, సెలవు దినాలు ఇవ్వాలని ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షులు జి.చిన్నబాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర డిమాండ్ చేశారు. అగ్రికల్చర్ కళాశాలలో శుక్రవారం నూతన కమిటీ ఏర్పాటయ్యింది. అధ్యక్షులుగా ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శంకరయ్య, కోశాధికారిగా మునిశేఖర్, సహాయ కార్యదర్శిగా రవి గురవయ్య, ఉపాధ్యక్షులుగా రమేష్, సహా అధ్యక్షులుగా మోహన్, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ గా శ్రీనివాసులు, చరణ్, వాసు ,రత్నమ్మ సుబ్రహ్మణ్యం, భార్గవ్, శ్రీనివాసులు, ప్రసాద్, మనోహర్ ఎన్నికయ్యారు.

వృత్తి నైపుణ్యంతో రైతులకు సేవలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వృత్తి నైపుణ్యంతో రైతులకు సేవలు అందించాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య కోరారు. పుత్తూరు డివిజన్ పరిధిలో పనిచేస్తున్న వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు, వడమాల పేట ఎంపీడీవో సమావేశ మందిరంలో శిక్షణ ఇచ్చారు. బతకడానికి ఆహారం తయారు చేసే రైతుల సేవే సృష్టిలో అత్యుత్తమైన సేవ అని చెప్పారు. సమస్యలతో సతమతమవుతున్న నేటి రైతులకు ఆధునిక సాగు పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకొని రైతులకు సేవలు అందించాలని సిబ్బందిని కోరారు. వ్యవసాయ పరిశోధన స్థానం పెరుమాళ్ళ పల్లె శాస్త్రవేత్త డాక్టర్ నాగమణి సాగులో చీడల వృద్ధికి సహకరించే అంశాలు, నివారణా చర్యల గురించి వివరించారు. పుత్తూరు ఉద్యాన అధికారి సౌజన్య మామిడి, కూరగాయలు, లిల్లీ, మల్లె పంటలలో చేపట్టవలసిన చీడల నివారణ గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏఓ వేణుగోపాలరావు వరి సాగులో చేపట్టవలసిన సాగు పద్ధతులు, కలుపు నివారణ గురించి వివరించారు. పుత్తూరు ఏడిఏ రమేష్, ఏవోలు విజయ్ కుమార్, కోదండయ్య, శోభ, హరిత, స్రవంతి పాల్గొన్నారు.



28-30 తేదీల్లో ఎస్ఎఫ్ఐ నిరసనలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

విద్యారంగ సమస్యల పరిష్కారానికి 28-30 తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసనలు తెలపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అక్బర్, రవి పిలుపునిచ్చారు. శుక్రవారం వేమన విజ్ఞాన కేంద్రంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. పెండింగ్‌లో ఉన్న 3,500 కోట్ల రూపాయల బకాయిలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటినా విడుదల చేయలేదన్నారు. కొన్ని కళాశాలలు పరీక్షలు రాయనీకుండా ఇబ్బందులు పెడుతున్నారని, మొన్న గూడూరులోని ఓ నర్సింగ్ కళాశాలకు ఇదే పరిస్థితి ఎదురయ్యిందన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కొనసాగాలని, 77వ జిఓను రద్దు చేసి అర్హులైన ప్రతి విద్యార్థికి స్కాలర్‌షిప్ ఇవ్వాలని, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు మెస్‌ఛార్జీ 100 రూపాయల చొప్పున కేటాయించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు.

సకల జీవజాతుల రక్షణతోనే మానవ మనుగడ

ప్రజాశక్తి - రేణిగుంట

కాకైనా, తేనెటీగైనా, పామైనా, సకల జీవజాతులను రక్షించుకుంటేనే మానవ మనుగడ సాధ్యమని జీవ వైవిధ్య ప్రచారకులు, జనవిజ్ఞాన వేదిక చిత్తూరు జిల్లా నాయకులు జి.సుధాకర్ అన్నారు. పోస్టర్లు, బ్యానర్లను ఏర్పాటు చేసి ఉదాహరణలతో విద్యార్థులకు వివరించారు. జీవ వైవిధ్య పరిరక్షణకు పాటుపడతామని, పర్యావరణాన్ని కాపాడుకోడానికి కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జెవివి రేణిగుంట మండల కార్యదర్శి కుప్పస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు ఓ.వెంకటరమణ, సైన్స్ టీచర్ నీలకంఠం, ముత్యాలరెడ్డి పాల్గొన్నారు.

త్వరలో 'హెల్తీ, హ్యాపీ ఇండియా'

పేద చిన్నారులకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు

'ఏ టు బి సామాజిక బాధ్యత'లో నరువి ఎండి సంపత్


మాట్లాడుతున్న నరువి హాస్పిటల్ ఎండి జీవి సంపత్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

పేద చిన్న పిల్లలకు ఉచిత గుండె శస్త్ర చికిత్సలను అడయార్ ఆనంద్ భవన్ (ఏ టు బి) రెస్టారెంట్స్ సామాజిక బాధ్యతలో భాగంగా నిర్వహించనున్నామని నరువి హాస్పిటల్స్ ఎండి డాక్టర్ జీవి. సంపత్ తెలిపారు. త్వరలోనే 'హెల్తీ ఇండియా... హ్యాపీ ఇండియా' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. శుక్రవారం వేలూరులోని నరువి హాస్పిటల్లో చిన్నపిల్లలకు ఉచిత గుండె శస్త్ర చికిత్సలపై విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నరువి హాస్పిటల్ ఎండి సంపత్ మాట్లాడుతూ ఈ ఉచిత గుండె శస్త్ర చికిత్సలు 5 నుండి 15 సంవత్సరాల లోపు ఉన్న వారికి నిర్వహిస్తామన్నారు. ప్రయోగాత్మకంగా మొదటగా వేలూరు, రాణిపేట, తిరుపతూర్, తిరువన్నామలై జిల్లాలలోని ప్రజలకు ఈ శస్త్ర చికిత్సలను వర్తింపజేశామన్నారు. ఎవరైతే పేద చిన్న పిల్లలు గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారో, వారు వారి హెల్త్ రిపోర్ట్ లతోపాటు ఆ గ్రామ విఏఓ సర్టిఫికెట్ ను తీసుకొని హాస్పిటల్ కు రావాలన్నారు. భవిష్యత్తులో ఈ శస్త్ర చికిత్సలు మంచి ఫలితాలను అందిస్తే మరిన్ని ప్రాంతాలకు విస్తరింప చేస్తామన్నారు. త్వరలో హెల్తీ ఇండియా - హ్యాపీ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామన్నారు. ఇప్పటివరకు నరువి హాస్పిటల్లో 154 సాధారణ, క్లిష్ట గుండె సంబంధిత శస్త్ర చికిత్సలను చేసామని, అందులో ఇద్దరు పిల్లలకు చేసామన్నారు. అడయార్ ఆనంద్ భవన్ ఎండి కె.టి. శ్రీనివాసరాజ మాట్లాడుతూ చిన్న సంస్థ నుండి ప్రారంభమై నేడు వివిధ ప్రాంతాలలో అడయార్ ఆనంద్ భవన్ బ్రాంచ్లను ఏర్పాటు చేసి ఎంతోమందికి ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. కోవిడ్ సమయంలోను ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా పేదరికంలో ఉండి గుండె సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్న చిన్న పిల్లలకు శస్త్ర చికిత్సలను ఉచితంగా నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. గుండె శస్త్ర చికిత్సలు చేయించుకోదలచిన వారు సిటివిఎస్ విభాగ సమన్వయకర్త పాల్ సెల్వం 8754047796 ను సంప్రదించాలన్నారు. నరువి హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాల్ హెన్రీ, చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ అరవిందన్ నాయర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జాకోబ్ జోస్, సిటివిఎస్ విభాగాధిపతి డాక్టర్ వినాయక్ శుక్ల పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి

తిరుపతి టౌన్ : ప్రభుత్వ ఉద్యోగులకు పిఎఫ్, కాంట్రిబ్యూషన్ పెన్షన్ బకాయిలను వెంటనే చెల్లించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్‌బాబు, జగన్నాథం డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుపతి కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పెన్షన్ లోక్ అదాలత్ కార్యక్రమం జరిగింది. తిరుపతి జిల్లాలో వివిధ మండలాల ఎంఈఓ లు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 2018, జూలై, 2019 జనవరి డీఏలకు సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేసి రెండు డి ఏ లను ఆరు విడతలుగా 2021 వ సంవత్సరంలో బిల్లులు చేసుకోవాల్సిందిగా షెడ్యూల్ ఇచ్చింది. ఈ ఆరు ఓపీఎస్ వారికి పిఎఫ్ ఖాతాలకు సిపిఎస్ వారికి పది పర్సెంట్ మినహాయించి క్యాష్ రూపంలో ఇచ్చేలా ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు తిరుపతి జిల్లాలో పీఎఫ్ ఖాతాలకు జమ కాలేదు. అలాగే 100 శాతం సిపిఎస్ వారికి నగదు రూపంలో చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి కఠారి మోహన్, జిల్లా సహాధ్యక్షులు ముని కష్ణమ నాయుడు పాల్గొన్నారు.



వృద్ధులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ఓం శ్రీ వృద్ధ ఆశ్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజెసి ఆధ్వర్యంలో వృద్ధులకు దుస్తులు, దుప్పట్లు శుక్రవారం పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాజీ రీజియన్ ఛైర్మన్ అరవిందు, మాజీ అధ్యక్షులు రవీంద్రరెడ్డి మాట్లాడుతూ క్లబ్ ద్వారా పట్టణ, పరిసర ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవరచుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు గురునాథం, మురళి నాయుడు, ప్రసాద్, ఎస్ఎల్ఎన్ స్వామి, గోపీనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

అనుమతులు లేని టపాసులు అమ్మితే నేరం: ఎస్ఐ

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: దీపావళి పండుగ సందర్భంగా అక్రమంగా అనుమతులు లేకుండా టపాసులు, బాణాసంచ విక్రయిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని బిఎన్ కండ్రిగ ఎస్ఐ విశ్వనాథ నాయుడు హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి ఎస్పీ ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి డిఎస్పి పర్యవేక్షణలో బుచ్చినాయుడు కండ్రిగ సిఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో నిఘా పెట్టామని హెచ్చరించారు. గతంలో పక్క మండలం వరదయ్యపాలెంలో అనుమతులు లేకుండా టపాసులు, బాణాసంచా అక్రమ తయారీ గోడౌన్ పేలుడు సంభవించి ముగ్గురు చనిపోయిన ఘటనను దృష్టిలో పెట్టుకుని ఈ సంవత్సరం బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో దీపావళికి నిఘా పెట్టామని తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలు తగదు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పారిశ్రామికవేత్త, సీనియర్ టిడిపి నాయకుడు గంగా ప్రసాద్‌పై సూళ్లూరుపేట నియోజకవర్గం పెళ్లకూరు మండలానికి చెందిన మాజీ జెడ్పిటిసి, వైసిపి సీనియర్ నాయకుడు సత్యనారాయణ రెడ్డి చేసిన అసభ్యకర వ్యాఖ్యలను తగదని, తీవ్రంగా ఖండిస్తున్నామని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే టిడిపి నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ సత్యనారాయణ రెడ్డి జీవితం ఎలాంటిదో తనకు బాగా తెలుసునన్నారు. ఎప్పుడూ ఏ నాయకుడి గురించి బహిరంగంగా ప్రస్తావించని గంగా ప్రసాద్‌పై సత్యనారాయణరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని హెచ్చరించారు. హుందా తనంగా నడుచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగింపు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రభుత్వ ఆట స్థలాన్ని ప్రధానోపాధ్యాయులు రమణయ్య జెసిబి సాయంతో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని పాఠశాలల కంటే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆటస్థలం చాలా పెద్దది ఈ పాఠశాలల్లో ఎప్పటి నుండో అనేక రకాల క్రీడలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రస్తుత వర్షాల కారణంగా ఆట స్థలం మొత్తం పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో విద్యార్థిని విద్యార్థులకు ఆటలాడుకోవాలని ఇబ్బందికరంగా మారిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆట స్థలాన్ని శుభ్రం చేయించామని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

31 వరకు టొయోటా ఫెస్టివల్ ఎడిషన్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: కార్ల కొనుగోలుదారుల కోసం ఈ పండుగ సీజన్‌ను ప్రత్యేకంగా మలుస్తూ టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) టొయోటా రూమియన్ ఫెస్టివ్ ఎడిషన్‌ను అందిస్తున్నట్లు ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేకమైన టొయోటా జెన్యూన్ యాక్సెసరీ ప్యాకేజీలను కలిగి ఉన్న ఈ లిమిటెడ్-ఎడిషన్ సీజన్‌ను చక్కగా, ఆకర్షణీయమైన శైలిలో జరుపుకోవడానికి సరైన మొబిలిటీ ఎంపికగా నిలుస్తుందన్నారు. ఇది అన్ని గ్రేడ్‌లలో అందుబాటులో ఉంది, కస్టమర్‌లు ప్రీమియం అనుభవాన్ని ఆస్వాదిస్తున్నారని నిర్ధారిస్తూ రూ. 20,608 విలువైన డీలర్-ఫిట్టెడ్ టిజిఎ ప్యాకేజీతో వస్తున్నాయన్నారు. విశాలమైన ఇంటీరియర్, ఇంధన సామర్థ్యం. ఉన్నతమైన భద్రతా అందిస్తుందన్నారు. 5-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ స్మూత్, 6-స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్, ఈ ఎంపివి నియో డ్రైవ్ (ఐఎస్ జీ)తో శక్తివంతమైన కె సిరీస్ 1.5-లీటర్ పెట్రోల్ ఇంజన్‌తో అందుబాటులో ఉంది. అత్యాధునిక కె -సిరీస్ ఇంజన్ పెట్రోల్ వేరియంట్‌కు 20.51 కెఎం/1, సిఎన్ జి వేరియంట్‌కు 26.11 కె ఎం/కెజి ఇంధన సామర్థ్యాన్ని కూడా అందిస్తుం దన్నారు. వినియోగదారుల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు తమ సంస్థ వెబ్‌సైట్లు సంప్రదించాలని కోరారు.

గ్రామసభలో ఆరు ఫిర్యాదులు

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): మండలంలో నిర్వహించిన భూమి రీ సర్వే రెవెన్యూ గ్రామ సభలో భూ సమస్యలపై ఆరు ఫిర్యాదులు అందినట్లు తహశీల్దారు శివరాం సుబ్బయ్య తెలిపారు. శుక్రవారం రెడ్డివారి పల్లిలో రెవెన్యూ గ్రామ సభను రెవెన్యూ అధికారులు నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో రైతులకు ఏదైనా సమస్యలు ఉంటే గ్రామసభ దృష్టికి తీసుకురావాలని రెవెన్యూ అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ భాస్కరయ్య, మండల సర్వేయర్ సురేష్ బాబు, వీఆర్వో విజయ్ కుమార్, సచివాలయ సర్వేయర్ మమత పాల్గొన్నారు.

వాసిరెడ్డి విమర్శలు విడ్డూరం



గూడూరు డివిజన్ యువజన అధ్యక్షులు సాయిప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - కోట: వైసిపి ప్రభుత్వంలో ఉన్నప్పుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై వాసిరెడ్డి పద్మ ప్రశంసలు కురిపించి ఇప్పుడు విమర్శలు చేయడం విడ్డూరంగా వుందని గూడూరు నియోజకవర్గ యువజన అధ్యక్షులు చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వైసిపిలో ఎస్పీ మహిళా ఛైర్‌పర్సన్‌గా వాసిరెడ్డి పద్మ రాజీనామా చేశారని, అయితే వైసిపి లో ఉన్నత పదవులు అనుభవించి, ఇప్పుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పై సంచలన ఆరోపణలు చేయడం, మీ సొంత రాజకీయ ఎజెండాతో జగన్‌పై బురద చల్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పార్టీలో ప్రభుత్వంలో పెద్ద పదవులు అనుభవించిన ఆమె నైతిక విలువలు గురించి మాట్లాడడం హాస్యాస్పదం అని చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వ పాలనలో వైసిపి లో ఉన్న అభిప్రాయం, టిడిపీ లో ఉంటుందా? ఇంకెవరైనా అందుకు చూడాలని వాసిరెడ్డి పద్మ ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గం పరిధిలోని 11 మంది నిరుపేదలకు వైద్య ఖర్చుల సాయం కింద రూ. 11.60 లక్షల మొత్తాన్ని చెక్కు రూపంలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. నిరుపేదలను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఆ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల పక్షపాతిగా ముందడుగు వేస్తున్నారని కితాబిచ్చారు.

ర్యాగింగ్ భూతాన్ని తరిమి కొడదాం : ఎస్పి

ప్రజాశక్తి - క్యాంపస్ : అవగాహనతో ర్యాగింగ్ భూతాన్ని తరిమి కొట్టాలని ఎస్పి సుబ్బరాయుడు పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంక్షేమ, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ర్యాగింగ్ పై విద్యార్థులకు 'ర్యాగింగ్ పట్ల జాగృతి' కార్యక్రమం శుక్రవారం శ్రీనివాస ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విసి ఆచార్య అప్పారావు, వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎమ్. భూపతి నాయుడు, కల్చరల్ కోఆర్డినేటర్ పత్తిపాటి వివేక్, తదితరులు పాల్గొన్నారు.

నారయ్యకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి -దొరవారిసత్రం: మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టరు నెలవల విజయశ్రీ సమీప బంధువు తూపిలి నారయ్య(70) అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ శుక్రవారం ఆయన సొంత గ్రామమైన కుప్పా రెడ్డిపాలెంలో నారయ్య భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బంధుమిత్రులను పలకరించి, కుటుంబీకులకు మనోధైర్యం కల్పించారు.

ప్రసూతి మరణాలు లేకుండా చర్యలు తీసుకోవాలి: కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసూతి మరణాలు జరగకుండా చూడాలని, అన్ని ఆస్పత్రుల్లో ప్రసవ సమయంలో తప్పని సరి ప్రోటోకాల్ పాటించాలని, ప్రసూతి మరణాలకు బాధ్యులని తేలితే చర్యలు తప్పవని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో జూన్ 2024 నుండి సెప్టెంబర్ 24 వరకు జరిగిన ప్రసూతి మరణాలపై సంబంధిత కుటుంబ సభ్యులతో, చికిత్స అందించిన డాక్టర్లు, అంగన్ వాడీ, ఎఎన్ఎం, ఆశాలతో కలెక్టర్, మెటర్నల్ డెత్ సర్వేలెన్స్ రెస్పాన్స్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ అధ్యక్షతన ఆడిట్ నిర్వహణ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నపాటి పొరపాటుకు తావులేకుండా ప్రసవ సమయంలో నియమావళి మేరకు వైద్యపరీక్షలు జరిపి తల్లి, బిడ్డ క్షేమానికి ప్రాధాన్యత నివ్వాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో జరిగే మాతృ మరణాలపై సంబంధిత బంధువులు వివరణ పరిగణలోకి తీసుకుంటామని, నిర్లక్ష్యం వహించిన వారిపై తప్పనిసరి చర్యలు ఉంటాయన్నారు. అన్వేష్ ఆసుపత్రి గూడూరు లో జరిగిన మాతృ మరణంపై త్రిసభ్య కమిటీతో విచారణ జరిపి చర్యలు తీసుకోవడానికి ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ కాలనీలు, గిరిజన ప్రాంతాలు, అక్షరాస్యత తక్కువ ఉన్న ప్రాంతాల్లో ప్రజలను చైతన్య వంతులను చేయాలన్నారు. ఈ సమావేశంలో డిసిహెచ్ఎస్ ఆనంద మూర్తి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి జయలక్ష్మి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి శాంత కుమారి, ఆదనపు డిఎంహెచ్ఓ శ్రీనివాస రెడ్డి, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థ సారథి రెడ్డి, ప్రైవేటు ఆసుపత్రుల డాక్టర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

నూతన సాంకేతికతను బోధనలో వినియోగించండి : విసి

ప్రజాశక్తి - క్యాంపస్ : అధ్యాపకులు నూతన సాంకేతికతను మేళవించిన, బోధనా నైపుణ్యాలతో బోధన ఉపకరణాలను వినియోగించి బోధనలో సరికొత్త ఒరవడిని తీసుకురావాలని ఎస్వీయూ ఇన్‌ఛార్జి విసి ఆచార్య సిహెచ్ అప్పారావు పిలుపునిచ్చారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం గ్రంథాలయ, సమాచార శాస్త్ర విభాగం స్వర్ణోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ శాస్త్ర విభాగం విద్యారంగానికి కావలసిన గ్రంథపాలకులను తయారుచేసి, వారిని సమాచార వారధులుగా సమాజానికి అందిస్తున్నదన్నారు. గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకులు సాంప్రదాయ బోధన పద్ధతులే కాకుండా, నవీన కాల పరిస్థితులకు అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, డిజిటల్ టెక్నాలజీ వంటి అధునాతన విద్యా పద్ధతులలో విద్యార్థులకు బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ద్రవిడ వర్సిటీ విసి ఆచార్య ఎం.దొరస్వామి, ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.భూపతి నాయుడు, ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సుధారాణి, గ్రంథాలయ, సమాచార శాస్త్ర విభాగం వ్యవస్థాపకులు ఆచార్య ఆర్. శ్రీపతి నాయుడు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో విభాగ పూర్వ ఆచార్యులు టి. రాజగోపాల్, వి. పుల్లారెడ్డి, కె. పద్మిని, విభాగాధిపతి డాక్టర్ ఎం. ప్రశాంత కుమారి, పూర్వ విద్యార్థులు డాక్టర్ రావి శారద, లింగుట్ల వెంకటేశ్వర్లు, కే. నారాయణమూర్తి, వివిఎస్. రమేష్ బాబు, అకడమిక్ కన్సల్టెంట్స్ సాధు రంగనాథం, బి. వీణా కుమారి, ఎం. కిషోర్ బాబు, ఏజే. మాధురి, సుధాకర్, గెస్ట్ ఫ్యాకల్టీ స్వర్ణలత, విద్యార్థిని, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.



ఘనంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: మండలంలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఉపాధ్యక్షులు సూర్య ప్రకాష్, జిల్లా సభ్యులు మోహన్ బాబు, శివకుమార్, విజయ్ కుమార్ హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన ఎన్నికలలో కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శశి కుమార్, ప్రధాన కార్యదర్శిగా సురేష్ భగవాన్, గౌరవాధ్యక్షులుగా రామకృష్ణారెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ యుటిఎఫ్ సభ్యులు తమకు ఈ అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో యూనియన్ సభ్యులకు ఎలాంటి సమస్య వచ్చినా ముందుండి పోరాడుతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల యుటిఎఫ్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్వర్ణోత్సవాల్లో పాల్గొన్న యుటిఎఫ్ సభ్యులు

సీఎం సహాయ నిధికి రూ.5 లక్షల విరాళం

ఎడిఫై సంస్థకు, విద్యార్థులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు

ప్రజాశక్తి -రామచంద్రాపురం (తిరుపతి రూరల్): తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు సమీపంలో ఉన్న ఎడిఫై విద్యాసంస్థ విద్యార్థులు విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి రూ.ఐదు లక్షల రూపాయల విరాళాన్ని ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని)కి అందించారు. రఘునాథ రిసార్ట్స్ లోని ఎమ్మెల్యే స్వగృహానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం వచ్చి చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవా భావం కలిగి ఉండటం గొప్ప విషయమన్నారు. సీఎం సహాయ నిధికి విరాళం ఇచ్చిన ఎడిఫై సంస్థ విద్యార్థులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి అభినందనలు తెలిపారు. ఎడిఫై విద్యార్థుల విశాల భావం పది మందికి ఆదర్శం కావాలన్నారు. కష్టాలలో ఉన్న సాటి వారిని ఆదుకుందామన్న ముఖ్యమంత్రి పిలుపుతో పలువుతో ఎడిఫై విద్యార్థులు విరాళాలతో ముందుకు రావటం ప్రశంసనీయమన్నారు. విద్యార్థు లందరూ ఉజ్వల భవిష్యత్తుతో మరింత మందికి ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఫై విద్యా సంస్థల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న ఎడిఫై సంస్థ యాజమాన్యం, విద్యార్థులు

తుడా నిధులతో అభివృద్ధి చేయండి : పులివర్తి నాని

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి పట్టణాభివృద్ధి శాఖ నిధులతో చంద్రగిరి నియోజకవర్గంలోని శివారు ప్రాంతాలలో పారిశుద్ధ్యం, మురికి వాడల్లో మౌలిక వసతులు కల్పించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి పట్టణాభివృద్ధి శాఖ ఉపాధ్యక్షులు ఎన్ మౌర్యను కోరారు. శుక్రవారం తిరుపతి పట్టణాభివృద్ధి శాఖ ఉపాధ్యక్షులు ఎన్ మౌర్యను చంద్రగిరి నియోజకవర్గ ఎంఎల్ఏ పులివర్తి నాని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాభినందనలు తెలిపారు. అనంతరం పలు అంశాలపై మాట్లాడారు. తుడా పరిధిలోని నగర శివారు ప్రాంతాలలో పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని కోరారు. ముఖ్యంగా మురికి వాడలలో మౌలిక వసతుల కల్పనకు ఉదారంగా నిధులు కేటాయించాలని తెలిపారు. సిమెంట్ రోడ్లు, తాగునీటి సౌకర్యాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. తిరుపతి ప్రధాన నగరం నుంచి మురుగునీరు శివారు ప్రాంతంలోకి ప్రవహిస్తోందన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడు ఉన్నారు.

పశుగణన సర్వే పక్కాగా నిర్వహించాలి: కలెక్టర్



పశుగణన సర్వేను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి -రామచంద్రాపురం (తిరుపతి రూరల్): పశు గణన సర్వేను తిరుపతి జిల్లాలో పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం చిగురువాడ పంచాయితీ సౌత్ కండ్రిగలో ఏర్పాటు చేసిన పశు గణన సర్వేను పశు సంవర్ధక శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్, కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తో కలిసిశుక్రవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎన్యూమరేటర్ కు ప్రజలు పూర్తి సమాచారం అందించి సహకరించాలని, పశు గణన సర్వే పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎస్వీ పశు వైద్య కళాశాల రిజిస్ట్రార్ రవికుమార్, ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి, కూటమి నాయకులు కేశవులు రెడ్డి, కేశవులు రాయల్, భాస్కర్ యాదవ్, మల్లీశ్వర్ రెడ్డి, మురళి, పాడి రైతులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం (చంద్రగిరి): రాష్ట్రంలో పాడి రైతుల సంక్షేమమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని, ఇందులో భాగంగా చేపట్టిన పశుగణనను అధికారులు పటిష్టంగా అమలు చేయాలని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చంద్రగిరి ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో పశుగణన పోస్టర్‌ను శుక్రవారం పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, టిడిపి నాయకులు దుబాసి రామ్మూర్తి, ఎస్ గౌస్ బాషా, సుబ్రహ్మణ్యం రెడ్డి, ఏజిపల్లి బాలకృష్ణ నాయుడు, కుమార్ రాజా రెడ్డి, వి రమేష్ రెడ్డి, సత్యూరి ధనంజయ రెడ్డి, ఆర్ మునిరత్నం రాయల్, పశు వైద్యాధికారులు డాక్టర్ కీర్తి పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: నారాయణవనం మండల పరిధిలో గోవింద పాళ్యంలో పశు గణనను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడు తూ పశుగణనకు ఇంటికి వచ్చేవారికి పూర్తి వివరాలు ఇచ్చి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణవనం, పాలమంగళం పశు వైద్యాధికారులు డాక్టర్ భార్గవి, ఎన్ఏ కుమార్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇలంగోవన్ రెడ్డి, నాయకులు జయచంద్ర నాయుడు, పద్దు రాజు, భక్తవత్సలం నాయుడు, ఎం.ఎస్ రవి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలు పశుగణనకు సహకరించాలని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పిలుపు నిచ్చారు. ఎమ్మెల్యే స్వగ్రామం ఊరందూరులో శుక్రవారం పశుగణన పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్వీ శ్రీకాంత్ బాబు, డాక్టర్ ఊహ, రవీంద్ర వర్మ, అరుణ్ కుమార్, ఉష, శరత్, పలువురు పశు సంవర్ధక శాఖ సహాయకులు పాల్గొన్నారు

తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని ఆమందూరు పంచాయతీలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి పశుగణన కరపత్రాలు, ఇంటింటికి స్టిక్కర్ వేయించే కార్యక్రమంలో వెటర్నీ అధికారులతో కలిసి పాల్గొని సంబంధిత కిట్టును స్థానిక సచివాలయ వెటర్నరీ అసిస్టెంటుకు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుణ యాదవ్, నియోజకవర్గ పార్టీ మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, పార్లమెంట్ ఎస్సీ అధికారి కేకే రమణ, మండల పార్టీ నాయకులు సదా శంకర్ నాయుడు, వెటర్నరీ డాక్టర్ శిల్పారెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ రాధిక పాల్గొన్నారు.

అక్రమ ఓడీలు నివారించండి: ఎస్‌డబ్ల్యూఎఫ్

ప్రజాశక్తి - సత్యవేడు: అక్రమ ఓడీలను నివారించాలని, స్టాఫ్, వర్కర్స్ చార్ట్ డ్యూటీలలో డివియేషన్ లేకుండా చూసి కొత్త చార్ట్ వేసేలా చూడాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు కోరారు. సత్యవేడు సిఐటియు కార్యాలయంలో సత్యవేడు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఇటీవల మరణించిన సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన తిరుపతి జిల్లా సిఐటియు ఉపాధ్యక్షులు నిలువు రమేష్, జిల్లా ఎస్‌డబ్ల్యూఎఫ్ జోనల్ కమిటీ నుండి కుబేంద్ర హాజరయ్యారు. ఈ సమావేశంలో సత్యవేడు డిపో స్టాఫ్, వర్కర్స్ సమస్యలపై చర్చించారు. సత్యవేడు డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యదర్శి జయకుమార్ రెడ్డి మాట్లాడుతూ డిపోలోని అక్రమ ఓడీలను తొలగించాలని, చార్ట్ డ్యూటీలలో డివియేషన్ లేకుండా చూసి కొత్త చార్ట్ వేసేలా చర్యలు చేపట్టాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

తెలుగుగంగ డీఈ శ్రీహరి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - సత్యవేడు: ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల భాగంగా సత్యవేడు తెలుగు గంగ కార్యాలయానికి వచ్చిన డి ఈ పి శ్రీహరి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో తిరుపతి ఈ ఈ కార్యాలయంలో విధులు నిర్వహించి సత్యవేడుకు బదిలీ కాగా మరో ఇద్దరు ఏ ఈ లు వెంకటరమణ, రాజగోపాల్ రెడ్డి లు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డి ఈ శ్రీహరి మాట్లాడుతూ తెలుగు గంగా నిర్మాణాలపై గాని సంబంధిత ఆస్తులపై గాని ఎలాంటి అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని చట్టపరమైన చర్యలు ఉంటాయని సూచించారు.

క్రైం న్యూస్

14 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి కడప జిల్లా బద్వేలు సమీప అటవీ ప్రాంతంలో 14 ఎర్రచందనం దుంగలను, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నత అధికారుల సూచనలతో కడప టాస్క్ ఫోర్స్ సబ్ కంట్రోల్ కు చెందిన ఆర్ఐ చిరంజీవులు బృందం, ఆర్ఎస్ఐ మురళీధర్ రెడ్డి బృందం గురువారం బద్వేలు సమీపంలోని బ్రాహ్మణ పల్లి వద్ద కూంబింగ్ చేపట్టారని అధికారులు తెలిపారు. ఆ ప్రాంతంలో కొందరు వ్యక్తులు మోటారు సైకిల్ ఉంచి మాట్లాడుతుండగా విచారించడానికి వెళ్లిన పోలీసులను చూసి పారిపోయారన్నారు. వారిలో ఒకరిని వెంబడించి పట్టుకున్నామన్నారు. పట్టుబడ్డ స్మగ్లర్ నెల్లూరు జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. ఈ ఘటనపై తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్ లో సిఐ సురేష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

దాడి కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఈ నెల 19వ తేదీన జరిగిన ఓ దాడి కేసులో నలుగురు నిందితులను శుక్రవారం వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. పెళ్లకూరు మండలం, అర్లపాడు గ్రామానికి చెందిన తరుణ్, తేజ అనే యువకులపై పట్టణానికి చెందిన పెరుమాళ్, బాలాజీ, రాహుల్, కోమల్ లు దాడి చేశారు. వారి వద్ద నుండి రెండు మొబైల్ పోన్లు, రూ.250 నగదును లాక్కెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం శ్రీకాళహస్తి కోర్టుకు తరలించినట్లు సిఐ గోపి తెలిపారు.

ఉత్కర్ష్ ఎస్ఎఫ్‌బిఎల్ అవుట్‌లెట్ ప్రారంభం




బ్యాంకింగ్ అవుట్‌లెట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఉత్కర్ష్ ఎస్ఎఫ్‌బిఎల్) ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో తమ కొత్త బ్యాంకింగ్ అవుట్‌లెట్ ను శుక్రవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా ఆ సంస్థ ఎండి, సీఈవో గోవింద్ సింగ్ మాట్లాడుతూ తిరుపతిలో తమ నూతన బ్రాంచ్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు . రాష్ట్రంలో మా కార్యకలాపాలను విస్తరించే దిశగా ఇది ఒక ముఖ్యమైన ముందడుగు. ఈ బ్యాంకింగ్ అవుట్‌లెట్ ప్రారంభోత్సవం, స్థానిక కమ్యూనిటీలకు బ్యాంకింగ్ సేవలను పొందడం మాత్రమే కాకుండా, స్థానిక కమ్యూనిటీలలో ఆర్థిక అభివృద్ధి, ఆర్థిక చేరిక సాధికారతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది' అని అన్నారు. పొదుపు , కరెంట్ ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్ లు సహా విభిన్నమైన ఆర్థిక ఉత్పత్తులు, సేవల శ్రేణిని తమ కస్టమర్‌లకు అందించే స్థితిలో బ్యాంక్ ఉందన్నారు. తన కస్టమర్ల ఆకాంక్షలను తీర్చడానికి, గృహ రుణాలు, వ్యాపార రుణాలు, ఆస్తిపై రుణం వంటి వివిధ రుణ ఉత్పత్తులను సైతం బ్యాంక్ అందిస్తుందని తెలిపారు. టాబ్లెట్ ఆధారిత అప్లికేషన్ అసిస్టెడ్ మోడల్, "డిజి ఆన్-బోర్డింగ్" ద్వారా బ్రాంచ్‌ను సందర్శించాల్సిన అవసరం లేకుండానే బ్యాంక్ ఖాతా తెరవడానికి కస్టమర్లకు బ్యాంక్ సదుపాయాన్ని అందిస్తుందని, దీన్ని వినియోగదారుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

కమిటీలలో బ్రాహ్మణులకు చోటు అభినందనీయం

- సీనియర్ ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావు



ప్రజాశక్తి - గూడూరు టౌన్: స్థానిక దేవాలయ కమిటీలలో బ్రాహ్మణులకు సభ్యులుగా చోటు కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతను మంత్రి వర్గ సభ్యులు నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని సీనియర్ ఆడిటర్, గూడూరు ఆదిశంకర బ్రాహ్మణ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీకంటి రామ మోహన్ రావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నిర్ణయం హిందూ సమాజ అభివృద్ధికి , దేశ అభివృద్ధికి తోడ్పడుతుందని వారికీ తిరుపతి జిల్లా, గూడూరు ఆదిశంకర బ్రాహ్మణ సేవా సంఘం తరపున కృతజ్ఞ తలు తెలుపుతున్నామన్నారు. ఈ సమావేశంలో ప్రసిడెంట్ ప్రసాద్, కార్యదర్శి నరేష్ అసోసియేట్ ప్రసిడెంట్ శ్రావణ్ కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత ఇసుక విధానం ప్రకటించినందుకు స్థానిక కార్వేటినగరం రోడ్డు కూడలిలో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పోతుకుంట విజయబాబు ఆధ్వర్యంలో శుక్రవారం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చి ముఖ్యమంత్రి సంక్షేమానికి కొత్త నిర్వచనం చెప్పారన్నారు. సీనరేజ్ తో పాటు జీఎస్టీ కూడా రద్దు చేసి ఉచిత ఇసుక విధానం అమలు చేయడం టిడిపికే సాధ్యమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వర మంగళం ఎంపీటీసీ శ్రీజ బాలాజీ నాయుడు, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి ఇ రవి నాయుడు, ఎస్సి సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జి ధనపాల్, మాజీ ఎంపీటీసీ పాండు రంగయ్య, జిల్లా టీఎన్‌టియుసి కార్యదర్శి అరవ ప్రకాష్, నియోజకవర్గ మహిళా కార్యదర్శి నాగరత్నమ్మ, మాజీ మండలపార్టీ అధ్యక్షులు విజయ్ శేఖర్ నాయుడు, జె మధుసూదనరాజు పాల్గొన్నారు.

28న ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈ నెల 28న ఆరు మస్టర్ పాయింట్లలో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) నాయకులు పిలుపునిచ్చారు. గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆరు మస్టర్ పాయింట్లలో గూడూరు మున్సిపల్ సంఘం పట్టణ కార్యదర్శి దారా కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై మున్సిపల్ ఆఫీసుల వద్ద నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జోగి శివకుమార్, పి శ్రీనివాసులు, బివి రమణయ్య, యస్ సురేష్, రాఘవయ్య, అల్లం శాంతి వర్ధన్, పెంచల ప్రసాద్, భూలోక మురళి, అంకయ్య, నందిపాక వెంకటేశ్వర్లు, సూరి, గిరి పాల్గొన్నారు.

మాటతీరు మార్చుకోవాలి..

ప్రజాశక్తి -కోట : టిడిపి అధిష్టాన నాయకులు, ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగా ప్రసాద్, స్థానిక గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌లపై ఎన్‌డీసీసీబీ మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి లేనిపోని మాటలు మాట్లాడడం సరికాదని, ఆయన మాట తీరు మార్చుకోవాలని కోట మండల టిడిపి మండల అధ్యక్షులు మద్దాలి సర్వోత్తమ రెడ్డి సూచించారు. మద్దాలి సర్వోత్తమ రెడ్డి శుక్రవారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్‌డీసీసీబీ మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఎన్నో సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్నా ఎలా మాట్లాడాలో తెలియని పరిస్థితుల్లో ఉన్నాడని ఎద్దేవా చేశారు. 'మద్యం షాపుల దరఖాస్తుల విషయంపై మాట్లాడుతూ నాలుగు నియోజక వర్గాల్లో తమ నాయకులు దౌర్జన్యాలు చేస్తే వైసీపీ నాయకులు మద్యం షాపులకు దరఖాస్తు చేయగలిగేవారా?' అని ప్రశ్నించారు. గత వైసిపి ప్రభుత్వ పాలనలో ఇసుక, సిలికా వ్యాపారాల్లో అడ్డు అదుపు లేకుండా అక్రమాలకు పాల్పడ్డారన్నారు. నీపై రెండు కేసులు పెట్టారని బాధపడుతున్నావు? గత మీ వైసీపీ ప్రభుత్వంలో తమ టిడిపి నాయకులు, కార్యకర్తలపై ఎన్ని కేసులు పెట్టారో ఓ సారి గుర్తు చేసుకోవాలన్నారు. తాము బెదిరించడం ప్రారంభిస్తే మీలాంటి నాయకులంతా పరుగులు తీస్తారన్నారు. తమ టిడిపి ప్రభుత్వంలో క్రమశిక్షణ కలిగిన నాయకత్వం వుండడం వల్లే నిజాయతీగా ఉన్నామన్నారు. టిడిపి ప్రభుత్వంలో పార్టీ నిబంధనల పరిధిలోనే ఉంటామన్నారు. ఇకపై తమ అధిష్టాన నాయకులను, కొండేపాటి గంగా ప్రసాద్‌ను, ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ లపై అన్యాయంగా మాట్లాడి ప్రతిష్టను దెబ్బతీసుకోవద్దన్నారు.

శవ రాజకీయాలు సరికాదు

పెళ్లకూరు మండలానికి చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకుని చనిపోతే దానిపై కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి శవ రాజకీయాలు చేయడం సరికాదని టిడిపి తిరుపతి పార్లమెంట్ ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ జలీల్ అహ్మద్ అన్నారు. కొండేపాటి గంగా ప్రసాద్‌పై కామిరెడ్డి సత్య నారాయణరెడ్డి నోటికి వచ్చి నట్లు మాట్లాడటం సబబు కాదన్నారు. ఆత్మహత్య చేస్ను వ్యక్తిని హైవేపై తీసుకొచ్చి స్థానిక

కామిరెడ్డి సత్యనారాయణకు టిడిపి నాయకుడు సర్వోత్తమ రెడ్డి సూచన



మాట్లాడుతున్న టిడిపి నాయకుడు సర్వోత్తమరెడ్డి

గ్రామసు _లను భయభ్రాంతులకు గురిచేసి నాటకాలు చిత్రీకరించడం సత్యనారాయణ రెడ్డికే దక్కుతుందన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో కిలివేటి సంజీవయ్య ఓడిపోవడానికి ప్రధానమైన కారకుడు ఈ సత్యనారాయణ రెడ్డేనని, దౌర్జన్యాలు, గొడవలు, అక్రమాలు, గుండాయిజం, భూ వివాదాలు సృష్టించే వ్యక్తి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అని తెలిపారు. గూడూరు, సూళ్లూరుపేట, సత్యవేడు ఎస్‌సి సామాజిక నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేలుగా గెలిపించి అసెంబ్లీ స్థానానికి పంపిన ఘనత కొండేపాటి గంగా ప్రసాద్‌కు దక్కుతుందన్నారు. ఎలాంటి కోపం, ఉద్రేకం, రెచ్చగొట్టే విధంగా మాట్లాడే వ్యక్తి కాదని, అలాంటి వ్యక్తిపై బురద చల్లడం సబబు అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో చేసిన అక్రమాలు, అన్యాయాలు త్వరలోనే బయట పెడతామని, అంతే కాకుండా జైలుకు వెళ్లే పరిస్థితులు కూడా త్వరలోనే వస్తాయని అన్నారు. ఇకపై తమ నాయకులు జోలికి రాకూడదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీనియర్ టిడిపి నాయకులు నెల్లూరు మోహన్ రెడ్డి, మర్రి అనిల్, కోకర్ల మధు యాదవ్, పల్లె మల్లు వెంకట కృష్ణారెడ్డి, పాదర్తి రాధాకృష్ణారెడ్డి, మర్రిపోలయ్య, చాపల శ్రీనివాసులు,కోట ఎంపీటీసీ షేక్ శంసుద్దీన్, నౌషద్, మోహన్, బాబు, తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

తిరుపతి విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా ఇవ్వండి: పసుపులేటి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదాను కల్పించాలని కోరుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ కోరారు. శుక్రవారం తిరుపతి పర్యటన నిమిత్తం వచ్చిన కేంద్ర విమాన యాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును కలిసి ఈ మేరకు ఆయన వినతి పత్రం అందించారు. అంతర్జాతీయ హోదాపై ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌తో చర్చించి అభివృద్ధిపై నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి తెలిపారన్నారు.